

గూడూరు పాఠశాలలో నిరసన తెలుపుతున్న బాషా పండితులు

## రంగారెడ్డి జిల్లాలో ప్రమోషన్లు, పదోన్నతులు చేపట్టాలి

కందుకూరు, జూన్ 24 : రంగారెడ్డి జిల్లాలో ఉపాధ్యాయులు, బాషాపండితుల బదిలీలు, ప్రమోషన్లు కల్పించాలని ఎస్‌టీఏ జిల్లా అధ్యక్షుడు ఎండీ బషీర్ కోరారు. ఐక్య ఉపాధ్యాయ పిలుసు మేరకు సోమవారం మధ్యాహ్నం విరామం సమయంలో మండల పరిధిలోని గూడూరు ప్రభుత్వ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో నల్ల బ్యాడ్జీలను ధరించి నరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో తెలుగు, హిందీ, బాషా పండితుల అప్‌గ్రేడేషన్ జరిగి పదోన్నతి పొందుతుంటే రంగారెడ్డి జిల్లాలో క్యాడర్ స్ట్రెంత్ కారణంగా ఆగిపోవడం, నిలిపివేయడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి బాషా పండితులతో పాటు ఉపాధ్యాయులకు బదిలీలు ప్రమోషన్లను కల్పించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో ఉపాధ్యాయులు అయూబ్, మృణాళిని, ఓంకారం, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.



తాసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

### అదనపు ఉపాధ్యాయులను పంపించాలి

317జీఓ క్యాడర్ స్ట్రెంత్‌కు మించి అదనంగా జిల్లాకు వివిధ కారణాల చేత వచ్చిన ఉపాధ్యాయులను వెంటనే తిరిగి పంపించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. తాసీల్దార్ గోపాల్‌కు వినతిపత్రం సమర్పించిన అనంతరం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యాయ పోరాట సంఘాల నాయకులు మండల టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ఎడ్ల కల్లేశ్, బుగ్గరాములు, పీఆర్‌టీయూ టీఎస్ ప్రధాన కార్యదర్శి నాగేందర్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులతో పాటు స్కూల్ అసిస్టెంట్‌లకు ప్రమోషన్లను కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించి ప్రస్తుత షెడ్యూల్‌లోనే ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీలను పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ పోరాటాల సంఘాల నాయకులు జంగయ్య, కృష్ణయ్య, జంగయ్య, బషీర్, అంబదాస్, రాజేశ్వర్, గోవర్ధన్, గోపాల్, లావణ్య, వనజ, ఉమా, ధనలక్ష్మి పాల్గొన్నారు.

## పనామా ఫ్లైఓవర్ నిర్మాణంతో
# ట్రాఫిక్ సమస్య పరిష్కారం

వనస్థలిపురం, జూన్ 24: పనామా చౌరస్తా వద్ద నిర్మిస్తున్న ఫ్లైఓవర్‌తో ఇక్కడి ట్రాఫిక్ సమస్యలు పరిష్కారమవుతాయని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. చింతలకుంట దాటినాక ప్రారంభమై, సుష్మా చౌరస్తాకు ముందు ఈ ఫ్లైఓవర్ ముగుస్తుందన్నారు. 850 మీటర్ల పొడవు ఉంటుందని తెలిపారు. డిమార్ట్ వద్ద, బీఎన్‌రెడ్డినగర్ చౌరస్తా వద్ద ఫ్లైఓవర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించడం జరిగిందన్నారు. ఇప్పటికే పలు ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం ద్వారా తీవ్రమైన ట్రాఫిక్ సమస్యను పరిష్కరించామన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడంతోపాటు, భద్రత విషయంలోనూ తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.



పనామా చౌరస్తా వద్ద నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

## పెండింగ్ బిల్లులు చెల్లించాలి

కందుకూరు, జూన్ 24: రంగారెడ్డి జిల్లా కంటి వెలుగు ప్రోగ్రామ్‌కు వాహనాలను నడిపించిన నిధులను చెల్లించాలని వాహనాల యజమానులు ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వ హయాంలో తాము నడిపించిన వాహనాలకు మాజీ సీఎం కేసీఆర్ నిధులను విడుదల చేసినా.. జిల్లా వైద్యాధికారి కొంత కాలంగా నిధులను చెల్లించడంలో జాప్యం చేస్తున్నారని పేర్కొన్నారు. సోమవారం ప్రజావాణిలో దరఖాస్తు చేసిన అనంతరం వాహనాల యాజమానులు మాట్లాడుతూ.. ప్రభుత్వం స్పందించి తక్షణమే నిధులను ఇప్పించి ఆదుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న వాహనాల యజమానులు



తైక్వాండోలో విజయం సాధించిన కావేటి ఆరుష్, కావేటి అవ్యుక్త్‌ను అభినందిస్తున్న తైక్వాండో కౌన్సిల్ ఆఫ్ ఇండియా అసోసియేషన్ ప్రతినిధులు

## తైక్వాండోలో పతకాలు సాధించిన ట్విన్స్

సైదాబాద్, జూన్ 24 : 7వ అంతర్జాతీయ తైక్వాండో చాంపియన్‌షిప్-2024 పోటీల్లో సైదాబాద్‌కు చెందిన ట్విన్స్ చక్కని ప్రతిభను ప్రదర్శించి పతకాలను సాధించారు. ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు గోవాలో మూడు రోజులపాటు జరిగిన తైక్వాండో కౌన్సిల్ ఆఫ్ ఇండియా అసోసియేషన్ ఆధ్వర్యంలో చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. సైదాబాద్ పూసలబస్తీకి చెందిన కావేటి పృథ్వీ కృష్ణ కుమారులు (ట్విన్స్) కావేటి ఆరుష్, కావేటి అవ్యుక్త్ తమ సత్తాను చాటారు. జాతీయ స్థాయి సబ్ జూనియర్ చాంపియన్‌షిప్ పోటీల్లో కావేటి ఆరుష్ బంగారు పతకం, కావేటి అవ్యుక్త్ కాంస్య పతకాన్ని సాధించారు. సోదరులిద్దరూ ఒకే క్రీడాలో ఒకరు బంగారు పతకాన్ని, మరోకరు కాంస్య పతకాన్ని సాధించారు. ప్రతిభ కబనర్చిన చిన్నారులకు పతకాలతోపాటు, ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. అంతర్జాతీయ సబ్ జూనియర్ తైక్వాండో పోటీల్లో సత్తాచాటిని చిన్నారులను సోమవారం సైదాబాద్ పలువురు అభినందించారు.

WANTED TEACHERS
RAGHUNATHA HIGH SCHOOL
Chaithanyapuri, Dilsukhnagar, Hyderabad - 500060
Phone No: 040-24040103
Wanted trained and talented lady Teacher for English (V to VII) Post. Salary (18000/- 22000/-).
Interested candidates can contact personally Headmistress along with testimonials.
Fluency in English is must.
Sd/- Headmistress




## మొహర్రానికి ఏర్పాట్లు చేయాలి



సయ్యద్ లాయక్ అలీ

చాదర్‌ఘాట్, జూన్ 24: మొహర్రం పండుగకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర షియా డెవలప్‌మెంట్, వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు సయ్యద్ లాయక్ అలీ, మౌలానా ఇర్ఫాన్ జాఫ్రీ తెలిపారు. మొహర్రం సమీపిస్తున్నా.. ప్రభుత్వం పనులు చేపట్టకపోవడం శోచనీయమన్నారు. పండుగ ఐదు రోజుల ముందు, జూన్ 28న ఏర్పాట్లకు సంబంధించి సమావేశం ప్రభుత్వం ఏర్పాటు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో నెల రోజుల ముందు సమావేశాన్ని ఏర్పాటు చేసి పనులను వెంటనే మంజూరు చేసి పూర్తి చేసేవారని గుర్తు చేశారు. అంతేకాకుండా 28న సమావేశంపై సరైన సమాచారం, స్పష్టత, పారదర్శకత లేదని అన్నారు. తద్వారా ప్రణాళికను అర్థం చేసుకునేందుకు కష్టంగా ఉందన్నారు. 28న ప్రభుత్వం నిర్వహిస్తున్న సమావేశం రాష్ట్ర స్థాయి లేదా, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని సమావేశామా అర్థం కావడం లేదని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది జనాభాతో జిల్లాలో, గ్రామాల్లో మొహర్రం జరపుకొంటారని ప్రభుత్వం గమనించాలని పేర్కొన్నారు. ప్రతి అషూరా ఇంట్లో ప్రతి పీర్ల వెనుక సుమారు ఆరు రోజుల వరకు ఆహారం(నియాజ్) పంపిణీ ఉంటుందన్నారు. వక్ఫ్ బోర్డు నిబంధనల ప్రకారం మొహర్రం వివరాలు తెలిసిన కమ్యూనిటీ పెద్దలకు డిపార్ట్‌మెంట్‌ల ద్వారా చర్చ, సమన్వయం కోసం సమావేశానికి ఆహ్వానించారా లేదా అని ప్రశ్నించారు. మొహర్రం ఏర్పాట్ల కోసం ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు ఎంత అనేది ఇంకా స్పష్టత లేదని విమర్శించారు. మొహర్రం ఏర్పాట్లలో సంబంధిత వ్యక్తులందరిని సమన్వయం చేసుకుని సమగ్రమైన, స్పష్టమైన సమాచారం ఇవ్వాలని సయ్యద్ లాయక్ అలీ ప్రభుత్వాన్ని కోరారు.



సుష్మ చౌరస్తా వద్ద డ్రైనేజీని శుభ్రం చేయిస్తున్న కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి

## మంచినీటి, భూగర్భ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి

హయత్‌నగర్, జూన్ 24: డివిజన్ పరిధిలోని ఆయా కాలనీల్లో ప్రధానంగా నెలకొన్న మంచినీటి, భూగర్భ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం మార్నింగ్‌వాక్‌లో భాగంగా డివిజన్‌లోని ఓల్డ్ విలేజ్ హయత్‌నగర్, సుష్మ చౌరస్తాల్లో స్థానికులతో కలిసి కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హయత్‌నగర్ ఓల్డ్ విలేజ్‌లో మంచినీటి సమస్యను సత్వరమే పరిష్కరించాలని జల మండలి అధికారులను ఆదేశించారు. సుష్మ చౌరస్తా వద్ద భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌ను పరిశీలించి సిబ్బందితో వాటిని శుభ్రం చేయించారు. ఆయన వెంట జల మండలి సిబ్బంది సత్తిరెడ్డి, ఆయా కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## గుడిసె బాధితులకు అన్నదానం

హయత్‌నగర్, జూన్ 24: ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సూచనల మేరకు హయత్‌నగర్‌లోని రేడియో స్టేషన్ ఎదుట గుడిసె బాధితులకు అన్నదాన కార్యక్రమాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. రెండు రోజుల క్రితం విజయవాడ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా అధికారులు హయత్‌నగర్‌లోని రేడియో స్టేషన్ ఎదుట ఉన్న గుడిసెలను తొలగించిన విషయం తెలిసిందే. ఘటనా స్థలానికి చేరుకుని బాధితులతో చర్చించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వారికి అండగా ఉంటానని భరోసానిచ్చారు. ఈ మేరకు బీఆర్‌ఎస్ హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు చెన్నగోని శ్రీధర్ గౌడ్, పలువురితో కలిసి గుడిసె బాధితులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా గుడిసె బాధితులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



గుడిసె బాధితులకు అన్నదానం చేస్తున్న బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు చెన్నగోని శ్రీధర్‌గౌడ్, తదితరులు

## మహనీయుల స్ఫూర్తితో ముందుకుసాగాలి



గాంధీ విగ్రహ ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్, జూన్ 24 : దేశం కోసం పోరాటం చేసిన మహనీయుల స్ఫూర్తితో ముందుకుసాగాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఉప్పల్ గాంధీ విగ్రహం పునర్నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షల మేరకు పనులు చేస్తామన్నారు. ఉప్పల్ గ్రామపెద్దల సహకారంతో ఉప్పల్ అభ్యున్నతికి నిరంతరం శ్రమిస్తామన్నారు. గతంలో తొలగించిన గాంధీ విగ్రహం మళ్లీ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఉప్పల్‌కు దిక్సూచిగా ఉన్న గాంధీ విగ్రహ పనులు సత్వరం పూర్తిచేసేవిధంగా చూస్తామన్నారు. ఉప్పల్‌లోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ శివారెడ్డి, హన్మంతరెడ్డి, ప్రవీణ్ ముదిరాజ్, మహేందర్, అర్జున్, రాజిరెడ్డి, నర్సింహారెడ్డి, అర్జున్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కిశోర్, నిరంజన్, కిరణ్, ఐలేష్, మహిళ నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## భార్యను హత్య చేసిన భర్త

ఎల్బీనగర్, జూన్ 24 : మద్యం మత్తులో భార్యతో గొడవ పడి.. హత్య చేసిన భర్త పారిపోయాడు. ఈ ఘటన సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి కథనం ప్రకారం.. బృందావన్ కాలనీలోకి చెందిన అన్వర్, గౌసియా (30) భార్యాభర్తలు. ఇద్దరూ ప్రతిరోజు రాత్రి సమయంలో మద్యం సేవించి గొడవ పడుతుంటారు. ఈ క్రమంలో జూన్ 22న కూడా ఇద్దరూ మద్యం సేవించి అర్ధరాత్రి 2 గంటల వరకు గొడవపడ్డారు. మరుసటి రోజు గౌసియా బయటకు రాలేదు. వీరింటికి సమీపంలోనే ఉంటున్న లక్ష్మి ఈ నెల 23న గౌసియాను పిలువగా ఆమె పలుకలేదు. దీంతో ఇంట్లోకి వెళ్లి చూడగా.. ఆమె హాల్‌లో చలనం లేకుండా పడి ఉన్నది. లక్ష్మి వెంటనే చుట్టుపక్కల వారిని పిలిచింది. వారు 108 అంబులెన్స్‌కు సమాచారమిచ్చారు. అంబులెన్స్ వైద్య బృందం గౌసియాను పరీక్షించి.. అప్పటికే ఆమె మరణించినట్లు గుర్తించారు. ఘటనా సమాచారం అందుకుని అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మెడచుట్టూ కమిలిన గాయాలు, రెండు చేతల పైన గాయాలు ఉన్నాయి. అక్కడి వారిని విచారించగా.. భర్త అన్వర్, భార్య గౌసియా గత రాత్రి రెండు గంటల వరకు గొడవ పడ్డారని తెలిపారు. భర్త అన్వర్ ఆమెకు ఉరిబిగించి.. ఊపిరి ఆడకుండా చేసి హత్య చేసినట్లు భావిస్తున్నట్టు సీఐ సైదిరెడ్డి తెలిపారు. గౌసియా భర్త పరారీలో ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మలక్‌పేట ట్రాఫిక్ పోలీసులకు ఉత్తమ సేవా పతకాలు



మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ట్రాఫిక్ ఎస్ఐ మహ్మద్ ఘనీ,

ఏఎస్ఐలు ఎన్.సుధాకర్‌రెడ్డి, జె.శివ నారాయణ

మలక్‌పేట, జూన్ 24: విధి నిర్వహణలో అంకిత భావాన్ని ప్రదర్శిస్తూ ఉత్తమ సేవలందిస్తున్న మలక్‌పేట ట్రాఫిక్ పోలీసులను ఉత్తమ సేవా పథకాలు వరించాయి. మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ సేవా పతకం, ఎస్ఐ మహ్మద్ ఘనీ ఉత్తమ సేవా పతకం, ఏఎస్ఐలు ఎన్.సుధాకర్‌రెడ్డి, జె.శివ నారాయణ సేవా పథకాలకు ఎంపికయ్యారు. ఈ మేరకు డీజీపీ కార్యాలయం నుంచి జీవో కాపీలు కూడా తమకు అందినట్లు మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. విధి నిర్వహణలో ఎలాంటి రిమార్క్ లేకుండా విధులు నిర్వహిస్తున్న తమకు రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ పురస్కారాలను ప్రకటించినట్లు చంద్రశేఖర్ తెలిపారు. 12 ఏండ్లుగా ఎలాంటి రిమార్క్ లేకుండా తాము అందిస్తున్న సేవలకు ఈ పురస్కారాలు లభించటం ఎంతో ఆనందంగా ఉందని ఈ పురస్కారాలు తమపై మరింత బాధ్యతను కూడా పెంచాయని పేర్కొన్నారు. ఈ పురస్కారాలకు ఎంపిక చేసిన ప్రభుత్వానికి, పోలీసు ఉన్నతాధికారులకు ఈ సందర్భంగా చంద్రశేఖర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## దాతల సహకారంతోనే ఆలయ అభివృద్ధి



కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి

చంపాపేట, జూన్ 24: దాతల సహకారంతో ఆలయం ఎంతో అభివృద్ధి చెందుతోందని కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయ పాలకమండలి చైర్మన్ నల్ల రఘుమారెడ్డి తెలిపారు. ఆలయ ప్రధాన ముఖ ద్వారం, కోనేరు మధ్యలో ఉన్న కొంత కాళీ స్థలంలో భక్తుల సౌకర్యార్థం రేకుల షెడ్డును ఏర్పాటు చేసేందుకు విరివిగా దాతలు అందించిన సహకారంతో చేపడుతున్న రేకుల షెడ్డు నిర్మాణ పనులను సోమవారం ఆలయ పాలక మండలి చైర్మన్ నల్ల రఘుమారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. నగరంలోని ప్రసిద్ధి చెందిన ఆలయాలతో పాటు కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయం ప్రసిద్ధి చెందిన పుణ్య క్షేత్రంగా విరాజిల్లుతుందన్నారు. ప్రతి శని, మంగళ వారం స్వామివారి దర్శనం కోసం భక్తులు వేలాదిగా తరలివస్తున్నారని అన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ఇంకా దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు మేక సురేందర్‌రెడ్డి, బబ్బూరి ఆనంద్‌కుమార్ గౌడ్, మేకల యాదగిరి, చీర తిరుమలేశ్, ముద్ద కళ్యాణ్ చక్రవర్తి, గూడూరు మధుసూదన్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌గుప్తా, చేగోని సురేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE
Under the instructions of my client, **Mrs. Raziya Sultana W/o. Mr.Shaik Abdul Khaja** this notice is hereby given to the general public that my client is the owner of the property being Premises bearing H.No.5-16/6/A (PTIN No.1178007303) on Plot bearing No. 12 Part, admeasuring 74 Sq.Yards with plinth area of 669 Sft., in RCC Ground Floor, in Survey No. 357, Situated at Khalsa Ibrahimpatnam Village and Revenue Mandal, Ranga Reddy District, having acquired the same vide a Registered Gift Deed bearing document No. 5823 of 2024 dated 06-05-2024 from Mrs.Mahammad Mumtaz Begum, who in turn has purchased the same vide Registered Sale Deed bearing document No. 1661 of 2003 dated 21-04-2003 from Mr. Pottabathini Bashaiah. It is informed to the general public that my client, has lost/misplaced the original link document of the property i.e Registered Sale Deed bearing document No. 1661 of 2003 dated 21-04-2003 and the same is not available in original with my client.
It is further informed that, any person who has found or who finds the above mentioned Title deed, may return the same by way of registered post to the address given below or inform the undersigned by telephone, any person/(s) having any objections, claims, right, lien, title over the said property may please contact the under signed within 10 days from the date of publication of this notice with relevant documents in support of their claim.
**Sd/- SRIRAM REGANI, Advocate,**
Flat No.307, MNK'S Vittal's Central Court, New Bhoiguda, Secunderabad-500003.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కందుకూరు, జూన్ 24 : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. కడ్తాల్ మండల పరిధిలోని ముద్వేన్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఈర్లపల్లి యాదయ్య (47) తన బైక్‌పై అదే గ్రామానికి చెందిన పోలె సంధ్య (18)ను కందుకూరు వెళ్లి వస్తుండగా.. శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారి దెబ్బడగూడ గేటు సమీపంలోకి రాగానే కడ్తాల్ నుంచి కందుకూరు వైపు రాంగ్ రూట్‌లో వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో యాదయ్య అక్కడికక్కడే మృతిచెందగా.. సంధ్యకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ శ్రావన్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. గాయాలైన బాలికను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు సీఐ సీతారామ్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా సరూర్‌నగర్ పట్టణం బొడ్రాయి పండుగ వార్షికోత్సవాలు

ఆర్కేపురం, జూన్ 24 : సరూర్‌నగర్ పట్టణంలో బొడ్రాయి పండుగ వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించే బొడ్రాయి పండుగ వార్షికోత్సవాల్లో పాల్గొని గ్రామ పెద్దలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగే బొడ్రాయి పండుగ వార్షికోత్సవాల్లో ప్రజలందరు ఘనంగా జరుపుకోవాలని తెలిపారు.

